## గ్లోబల్ యూత్ సమ్మిట్‌కు కృతిక ప్రియచందన

హనుమకొండ చౌరస్తా, జూన్ 1 : కాకతీయ విశ్వవిద్యాలయ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్, మహిళా ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థిని కృతిక ప్రియచందన ఈ నెల 5, 6వ తేదీల్లో కర్ణాటక రాష్ట్రం మంగుళూరులో జరిగే గ్లోబల్ యూత్ సమ్మిట్-2025కు ఎంపికైనట్లు విశ్వవిద్యాలయ ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ నారాయణ తెలిపారు. కృతిక ప్రియచందనను వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం, మహిళా ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ భిక్షాలు అభినందించారు.

## పీజీ కాలేజీ నూతన ప్రిన్సిపాల్‌గా నరసింహాచారి

హనుమకొండ చౌరస్తా, జూన్ 2 : కేయూ సుబేదారి, పీజీ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా కామర్స్ విభాగ ఆచార్యులు నరసింహచారిని వీసీ ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమిస్తూ రిజిస్ట్రార్ రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. నరసింహాచారి గతంలో అడ్మిషన్ల సెల్ డైరెక్టర్‌గా, ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ సంచాలకుడిగా, పరీక్షల విభాగ నియంత్రణాధికారిగా పనిచేశారు.

**కే-హబ్ ఇన్‌చార్జి కో ఆర్డినేటగా కిరణ్‌కుమార్..**

కాకతీయ విశ్వవిద్యాలయ మహిళా ఇంజినీరింగ్ కళాశాల సీఎస్‌ఈ విభాగ ఒప్పంద అధ్యాపకుడు కిరణ్‌కుమార్‌ను కే-హబ్ ఇన్‌చార్జి కో ఆర్డినేటర్‌గా నియమిస్తూ రిజిస్ట్రార్ రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు.

**కేయూ మహిళా పీజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా జ్యోతి..**

సుబేదారిలోని కేయూ మహిళా పీజీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ జ్యోతిని నియమిస్తూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రిన్సిపాల్ మధుశ్రీ పదవీకాలం పూర్తికావడంతో ఈ ఖాళీ ఏర్పడింది.

**కేయూలో సహాయ రిజిస్ట్రార్ల బదిలీలు..**

కేయూ వీసీ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ పలువురు సహాయ రిజిస్ట్రార్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో శ్రీధర్‌ను యూనివర్సిటీ కాలేజీ నుంచి అడ్మినిస్ట్రేషన్ టీచింగ్ అండ్ నాన్ టీచింగ్‌కు, ప్రణయకుమార్‌ను అడ్మినిస్ట్రేషన్ టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ సెక్షన్ నుంచి కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్ కార్యాలయానికి, శ్రీలతాదేవిని పరీక్షల విభాగం నుంచి అకౌంట్స్ బ్రాంచ్‌కు, శ్రీలతను అకౌంట్స్ బ్రాంచ్ నుంచి యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీకి, నేతాజీని పరీక్షల విభాగానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్‌కు వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పగించారు.

## 4,5వ తేదీల్లో అండర్-19 జిల్లా జట్ల ఎంపిక

హనుమకొండ చౌరస్తా, జూన్ 2 : హనుమకొండ, వరంగల్, జనగామ, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల అండర్-19 క్రికెట్ జట్లను ఎంపిక చేసేందుకు ఈ నెల 4, 5వ తేదీల్లో కరుణాపురంలోని వంగపల్లి క్రికెట్ క్రీడా మైదానంలో పోటీలు నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా క్రికెట్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. ఎంపికైన 6 జిల్లా జట్లు జూన్ రెండవ వారం నుంచి నిర్వహించనున్న టోర్నమెంట్‌లో పాల్గొంటాయని, అందులో రాణించిన క్రీడాకారులను ఉమ్మడి వరంగల్ అండర్-19 జిల్లా క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. 2006 సెప్టెంబర్ 1 తర్వాత జన్మించిన వారు మీ సేవ జారీ చేసిన పుట్టిన తేదీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, సొంత క్రికెట్ కిట్‌తో పాల్గొనాలని తెలిపారు.

## 7న జేఎన్‌ఎస్‌లో బాక్సింగ్ ఎంపికలు

హనుమకొండ చౌరస్తా, జూన్ 2 : ఈ నెల 7న అండర్-17 (జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్) జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు హనుమకొండ, వరంగల్ బాక్సింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పోతరాజు రాజేందర్ తెలిపారు. జనవరి 1, 2009 నుంచి డిసెంబర్ 31, 2010 మధ్య జన్మించినవారు అర్హులని, జేఎన్‌ఎస్ బాక్సింగ్ హాల్‌కు ఆధార్‌కార్డు, స్కూల్ బోనోఫైడ్, బర్త్ సర్టిఫికెట్ జిరాక్స్, రెండు పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు, రూ.300 ఎంట్రీ ఫీజుతో రావాలన్నారు. ఇందులో ఎంపికైన వారు ఈ నెల 10, 11వ తేదీల్లో నిజామాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

పరకాల, జూన్ 2 : విత్తన వ్యాపారులు రైతులకు నాణ్యవైన విత్తనాలను అందించేందుకు కృషి చేయాలని రైతు రుణ విమోచన కమిటీ రాష్ట్ర మాజీ చైర్మన్, ఉమ్మడి జిల్లా సీడ్స్, ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని స్వర్ణ గార్డెన్స్‌లో జరిగిన సీడ్స్, ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్ పట్టణ కమిటీ ప్రమాణ సీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారిగా ఎన్నికైన గందె వెంకటేశ్వర్లు, శివాజీ, ఎర్ర లక్ష్మణ్‌ను అభినందించారు.

## వసతుల మెరుగు కోసమే వంద రోజుల ప్రణాళిక

పరకాల, జూన్ 2 : మున్సిపాలిటీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, మౌలిక వసతులు కల్పించేందుకు వంద రోజుల ప్రణాళిను చేపట్టామని మున్సిపల్ కమిషనర్ చెల్పూరి వెంకటేశ్ పేర్కొన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు. ఏఈ రంజిత్, జేఏవో అర్షద్, ఏవో రఘు, సీనియర్ అకౌంటెంట్ శ్రీనివాస్, ఆర్ఐ రవి పాల్గొన్నారు.

## రైతులు బయో మందులు వాడొద్దు

శాయంపేట, జూన్ 2 : రైతులు బయో ఫర్టిలైజర్స్‌ను వాడొద్దని మండల వ్యవసాయ అధికారి గంగాజమున అన్నారు. సూరంపేటలో రైతులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జీపీ కార్యదర్శి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## సిమెంట్ బస్తాల పేరుతో సినీ ఫక్కీలో మోసం

**రూ.3వేలతో దుండగుల ఉడాయింపు**

కమలాపూర్, జూన్ 2 : మండలంలోని ఉప్పల్ గ్రామంలో సిమెంట్ బస్తాల పేరుతో సినీ ఫక్కీలో మోసం చేసి దుండగులు రూ.3వేలతో ఉడాయించినట్లు సోమవారం గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన మొండెద్దుల శంకరయ్య-శంకరవ్వ దంపతులు ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నారు. సిమెంట్ బస్తాలు కొనుగోలు చేసేందుకు శంకరవ్వ సిమెంట్ షాపుకు వెళ్లింది. ఈ క్రమంలో ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఇసుక పంపిస్తామని రూ. 6వేలు ఇవ్వాలని శంకరయ్యను అడిగారు. కాగా, సిమెంట్ బస్తాలు కొనేందుకు దుకాణం వద్దకు తన భార్య వెళ్లిందని చెప్పగా, సదరు వ్యక్తులు అక్కడికి వెళ్లి 'మీ మేస్త్రీ చెప్పిండు.. సిమెంట్ బస్తాలు కమలాపూర్ నుంచి తెచ్చి మీ ఇంటి వద్ద వేసినం.. నీకు నమ్మకం లేకపోతే మేస్త్రీతో మాట్లాడు.' అని ఫోన్ మాట్లాడించి నమ్మించారు. దీంతో శంకరవ్వ రూ.3వేల ఇవ్వగా, అక్కడి నుంచి వారు ఉడాయించారు. ఇంటికి వెళ్లిన శంకరవ్వ సిమెంట్ బస్తాలు లేకపోవడంతో కంగుతిన్నది. తాను మోసపోయి డబ్బులు ఇచ్చానని కన్నీటి పర్యంతమైంది.

## రోడ్డు ఆక్రమించి ప్రహరీ నిర్మాణం

**చర్యలు తీసుకోవాలని ఆర్డీవో, తహసీల్దార్‌కు ఫిర్యాదు**

కమలాపూర్, జూన్ 2 : మండలంలోని అంబాలలో జెర్రిపోతుల సారయ్య, కుక్కల మల్లయ్య రోడ్డును ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తున్నారని రైతులు కెత్తె మొగిలి, సారయ్య, రమేశ్, రవి, రాజేందర్, రవి, భద్రయ్య సోమవారం ఆర్డీవో రాథోడ్ రమేశ్, తహసీల్దార్ సురేశ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 506లో పర్మిషన్లు లేకున్నా రోడ్డు ఆక్రమించి నిర్మాణం చేస్తున్నారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఐఐటీ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శివానీ ప్రభంజనం

హసన్‌పర్తి, జూన్ 2 : ఐఐటీ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శివానీ జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయి ర్యాంకులు సాధించారు. అభినయ్ 98, రమేశ్ 536, సురేందర్ 548, తరుణ్ 632, సందీప్ 1,756, యాకేశ్ 1,944, గణేశ్ 2,361వ ర్యాంకులు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ స్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్నేళ్లుగా కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఫలితాలు సాధిస్తూ సాధారణ విద్యార్థులను ర్యాంకర్లుగా తీర్చిదిద్దడం ఒక్క శివానికే సాధ్యమన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ స్వామి, ప్రిన్సిపాళ్లు సురేందర్‌రెడ్డి, చంద్రమోహన్, డైరెక్టర్లు రాజు, రమేశ్, మురళీధర్, సురేశ్, సంతోష్‌రెడ్డి అభినందించారు.


అభినయ్


సందీప్


గణేశ్


రమేశ్


సురేందర్


తరుణ్


యాకేశ్


పరకాల : ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి


హనుమకొండ : జెండా ఎగురవేస్తున్న మార్నేని రవీందర్‌రావు


వరంగల్ : వంద రోజుల ప్రణాళికా కార్యక్రమంపై ప్రతిజ్ఞ చేస్తున్న మేయర్ సుధారాణి, ఎమ్మెల్యే నాయిని


హనుమకొండ : జెండాకు సెల్యూట్ చేస్తున్న టీఎన్జీవోస్ నేతలు

# జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి


సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న మంత్రి కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

- జిల్లాకు రెండు యంగ్ ఇండియా మోడల్ స్కూళ్లు
- మంత్రి కొండా సురేఖ
- పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అంగరంగ వైభవంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు
- అమరవీరుల కుటుంబాలు, స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం

హనుమకొండ, జూన్ 2 : జిల్లా సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం హనుమకొండ పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు హాజరై జాతీయ జెండా ఎగురవేశారు. అమరవీరుల కుటుంబ సభ్యులు, స్వాతంత్ర్య సమర యోధులను సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల్లో జిల్లా వ్యాప్తంగా 5.50 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారని తెలిపారు. జిల్లాలో మొదటి దశలో 705, రెండో దశలో 5 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, లబ్ధిదారులకు ప్రతి సోమవారం నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఐదు మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేశామని, 25,35,964 మంది రైతులకు రూ.450కోట్లు రుణమాఫీ చేశామని తెలిపారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల నష్టపరిహారం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులకు రేషన్ కార్డుల జారీ ప్రక్రియను ప్రారంభించామన్నారు. పారదర్శకంగా కులగణన నిర్వహించి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రాజీవ్ అభయ హస్తం పథకం కింద సివిల్స్ చదివే వారికి ఆర్థికసాయం అందిస్తున్నామన్నారు. జిల్లాలో రెండు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లు మంజూరైనట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లోని చెంచులకు 10వేల గృహాలు కేటాయింపు, సాగు నీరు, విద్యుత్ సదుపాయానికి ఇందిర సౌర గిరి జల వికాసం కార్యక్రమం ప్రారంభించినట్లు చెప్పారు. అలాగే వరంగల్ మామునూరు విమానాశ్రయాన్ని సాధించామని మంత్రి పేర్కొన్నారు. కుడా పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజక వర్గాల్లో మౌలిక వసతులు కల్పించామన్నారు. రూ. 30 కోట్లతో భద్రకాళీ ఆలయ మాడ వీధుల నిర్మాణం, రూ.5 కోట్లతో ఎల్కతుర్తి జంక్షన్ అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం ఏప్రిల్ 14న ప్రవేశపెట్టిందన్నారు. జే చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం మూడో దశలోని ప్యాకేజీ-11 పనులను రూ.2,229.909 కోట్లతో చేపట్టామని, దాదాపు అరవై వేల ఎకరాలకు నీరందించనున్నట్లు చెప్పారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద మొబైల్ ఫిష్ అవుట్‌లెట్లు 3 యూనిట్ల(ఒక్కో యూనిట్ రూ.10 లక్షలు.. 40 శాతం సబ్సిడీ) పంపిణీ చేశామన్నారు. ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 83 పరిశ్రమలకు అనుమతులు ఇచ్చామన్నారు. జేఎన్‌ఎస్‌లో రూ.7 కోట్లతో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మించామని, వన మహోత్సవంలో భాగంగా జిల్లాలోని నర్సరీల్లో 26లక్షల మొక్కలు పెంచుతున్నామని పేర్కొన్నారు. వంగరలోని పీవీ విజ్ఞాన కేంద్రం అభివృద్ధి పనులు సుమారు రూ.7 కోట్లతో జరుగుతున్నాయని తెలిపారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ ప్రావీణ్య, పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. లష్కర్‌బజార్ బాలికల పాఠశాల, జడ్పీహెచ్‌ఎస్ హసన్‌పర్తి, మడికొండ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినులు ప్రదర్శనలు ఇచ్చారు. గృహ నిర్మాణ, వైద్య ఆరోగ్య, వ్యవసాయ, ఆర్టీసీ, జిల్లా గ్రామీణ అభివృద్ధి, పౌర సరఫరాలు, మత్స్య, బీసీ వెల్ఫేర్, అగ్నిమాపక తదితర శాఖలకు సంబంధించిన ప్రభుత్వ పథకాలను తెలియజేస్తూ తయారు చేసిన శకటాలు ఆకట్టుకున్నాయి. వైద్యారోగ్య శాఖ శకటానికి మొదటి బహుమతి, డీఆర్‌డీవో శకటానికి రెండో, వ్యవసాయ శాఖ శకటానికి మూడో బహుమతిని జిల్లా అధికారులు ప్రకటించారు. అలాగే అదాలత్ సెంటర్‌లోని అమర వీరుల స్తూపం వద్ద పూల మాలలు వేసి మంత్రి నివాళులర్పించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ జాతీయ జెండా ఎగురవేశారు. ఇన్‌చార్జి అదనపు కలెక్టర్లు వైవీ గణేశ్, మేన శ్రీను పాల్గొన్నారు. జిల్లా పరిషత్ ఆవరణలోని వృద్ధుల డే-కేర్ సెంటర్‌లో జిల్లా సంక్షేమ అధికారి జయంతి పతాకావిష్కరణ చేశారు. బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంపై రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు జాతీయ జెండా ఎగురవేశారు. అదాలత్ సెంటర్ లోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఉన్నారు. హనుమకొండ అలంకార్ జంక్షన్‌లోని టీఎన్జీవోస్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ జెండా ఎగుర వేశారు. జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేశ్, గౌరవాధ్యక్షుడు శ్యామ్ సుంద పాల్గొన్నారు. నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ భవన్‌లో ఇన్‌చార్జి హెచ్‌ఆర్డీ డైరెక్టర్ అశోక్ కుమార్ జాతీయ జెండా ఆవిష్కరించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ ఉద్యోగుల అమరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. నక్కలగుట్టలోని వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం హనుమకొండ పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్నారు. వరంగల్ జిల్లా కోర్టు ఎదుట ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ, హనుమకొండ కోర్టు ఎదుట ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి అపర్ణాదేవి జాతీయ జెండా ఆవిష్కరించారు. వరంగల్ బార్ అసోసియేషన్ ఎదుట అధ్యక్షుడు వలుస సుధీర్, హనుమకొండ బార్ అసోసియేషన్ ఎదుట అధ్యక్షుడు పులి సత్యనారాయణ జాతీయ జెండా ఎగురవేశారు. అలాగే రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా న్యాయస్థానాలకు సెలవు ప్రకటించకపోవడం విచారకరమని వలుస సుధీర్ అన్నారు.

**నమస్తే నెట్‌వర్క్ :** రాష్ట్ర అవతరణ దినోత్సవం బల్దియా ప్రధాన కార్యాయలంలో ఘనంగా నిర్వహించారు. మేయర్ గుండు సుధారాణి జాతీయ జెండా ఎగురవేశారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2 నుంచి సెప్టెంబర్ 9వ తేదీ వరకు నిర్వహించే వంద రోజుల ప్రణాళికా ర్యాలీని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ఆమె ప్రారంభించారు. నగరంలో రూ.4,170 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టామన్నారు. గ్రేటర్ పరిధిలో పేదలకు 8,075 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని అన్నారు. అనంతరం బల్దియా సిబ్బందికి పీపీఈ కిట్లు అందజేశారు. డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, కార్పొరేటర్లు, అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, ఇన్‌చార్జి సిటీప్లానర్ రవీందర్ రాడేకర్ పాల్గొన్నారు. కాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బావ్‌సింగ్, పోలీస్ స్టేషన్‌లో సీఐ సుధాకర్‌రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు. క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే నాయిని జెండా ఆవిష్కరించారు. పోలీసు కమిషనరేట్‌లో సీపీ జెండా ఆవిష్కరించారు. అదాలత్‌లోని అమరవీరుల స్తూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా, అదనపు డీసీపీలు సురేశ్‌కుమార్, రవి, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు. కాకతీయ యూనివర్సిటీ పరిపాలనా భవన ప్రాంగణంలో రిజిస్ట్రార్ రామచంద్రం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కేయూ వీసీ ప్రతాపరెడ్డి హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు పున్నం చందర్, కనకరాజ్, నరసింహారావు, ఖలీల్, శ్రీనివాస్, రంజిత్, శివకుమార్, వినయ్ కుమార్, రామకోటి వేడుకల్లో పాల్గొన్నారు. ఆవిర్భావ వేడుకల్లో ఆర్టీసీ ఆర్ఎం విజయభాను పాల్గొన్నారు. ఏప్రిల్ 2024 నుంచి, మార్చి 2025 వరకు గత సంవత్సరంతో రూ.134.66 కోట్ల ఆదాయం అదనంగా సమకూరిందన్నారు. అలాగే జిలాలోని అన్ని మండలాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంపీడీవోలు, తహసీల్దార్లు ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. పరకాల క్యాంపు కార్యాలయం, అమరధామంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పాత ఏటీఎం సెంటర్‌లో నిర్వహించిన వేడుకల్లో బండి సారంగపాణి, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్, కోర్టులో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి నూతంకి శాంతి సోని, ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ సతీశ్‌బాబు, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆంజనేయులు, ఏఎంసీ కార్యాయలంలో ఏఎంసీ చైర్మన్ రాజిరెడ్డి జెండా ఎగురవేశారు. ముల్కనూరు సహకార గ్రామీణ బ్యాంకులో అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, ముల్కనూరు మహిళా సహకార పాల డెయిరీలో అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ జెండా ఎగురవేశారు.


వరంగల్ లీగల్ : అమరులకు నివాళులర్పిస్తున్న న్యాయవాదులు


పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నృత్యాలు చేస్తున్న చిన్నారులు


పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రదర్శిస్తున్న ఆర్టీసీ శకటం


ఆత్మకూరు : ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి


దామెర : మండల పరిషత్ కార్యాలయంలో జాతీయగీతం ఆలపిస్తున్న ఉద్యోగులు


శాయంపేట : స్టేషన్‌లో జెండా ఎగరేస్తున్న సీఐ రంజిత్


భీమదేవరపల్లి : జాతీయజెండాకు సెల్యూట్ చేస్తున్న ముల్కనూరు బ్యాంకు అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి


హసన్‌పర్తి : జాతీయ జెండా ఎగురవేస్తున్న శ్రీధర్


వేలేరు : పోలీసు స్టేషన్‌లో జెండా ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న ఎస్సై సురేశ్


ఐనవోలు : జాతీయ జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న తహసీల్దార్ విక్రమ్‌కుమార్


కాజీపేట : జంక్షన్ ఆవరణలో జరిగిన రాష్ట్ర అవతరణ వేడుకల్లో పాల్గొన్న రైల్వే కార్మికులు

## ఉమ్మడి జిల్లా వెలమ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

న్యూశాయంపేట, జూన్ 2 : వరంగల్ ఉమ్మడి జిల్లా వెలమ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. హంటర్ రోడ్డులోని వెలమ సంక్షేమ భవన్‌లో జరిగిన ఎన్నికల్లో 2,396మంది సభ్యులకు 1,434 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధ్యక్షుడిగా నడిపల్లి వెంకటేశ్వరరావు తన సమీప అభ్యర్థిపై 323 ఓట్లతో గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా కాకులమర్రి ప్రవీణ్ కుమార్ ఎంపికయ్యారు. ఈ కార్యవర్గం మూడు సంవత్సరాల పాటు కొనసాగనున్నది. ఉపాధ్యక్షులుగా పిన్నింటి బాలచందర్‌రావు, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, తక్కెళ్లపల్లి శ్యాంసుందర్ రావు, కోశాధికారి సిద్దూరి స్వామిరావు. సంయుక్త కార్యదర్శిగా పల్లెపాటి విద్యాసాగర్‌రావు, కార్యవర్గ సభ్యులుగా పుస్కూరి రఘుకుమార్, గండ్ర ప్రభాకర్‌రావు, తక్కళ్లపల్లి బలరామారావు, మార్తినేని రవీందర్ రావు, చెన్నమనేని జయశ్రీ, గుజ్జ గోపాల్ రావు, తక్కళ్లపల్లి అమృతరావు, గండ్ర గోపాల్‌రావు, లింగంపల్లి పాపారావు, పిన్నింటి వెంకటేశ్వరరావు, రంజిత్ కుమార్, ఎన్నమనేని శ్రీనివాసరావును ఎన్నుకున్నారు.


వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు


ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి

## పేకాటరాయుళ్ల అరెస్టు

కమలాపూర్, జూన్ 2 : మండలంలోని అంబాలలో పేకాడుతున్న ఆరుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు సీఐ హరికృష్ణ సోమవారం తెలిపారు. గ్రామ శివారులో పేకాడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసి వారి నుంచి రూ. 6,780, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ఆత్మకూరు, జూన్ 2 : మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్యతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. పెరుమాండ్ల రామకృష్ణ, ఎమ్మార్పీఎస్ నాయకులు రవి, రఘు, కిరీటి, అయోధ్య పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

ఐనవోలు, జూన్ 2 : ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును కారు ఢీకొట్టింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రురు నుంచి వరంగల్ వెళ్తున్న బస్సు పంథినిలో ప్రయాణికుల కోసం ఆగి ఉండగా అతివేగంగా వచ్చిన కారు అదుపు తప్పి వెనుక వైపున ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. కారు భీభత్సంతో బస్సులో ఉన్న ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు.

## కాజీపేట జంక్షన్ అభివృద్ధికి కృషి

కాజీపేట, జూన్ 2 : కాజీపేట రైల్వే జంక్షన్ ప్రాముఖ్యతను కాపాడేందుకు చర్యలు తీసుకుంటానని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. జంక్షన్‌ను బలోపేతం చేయాలని, క్రూ ల్యాబీలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, రన్నింగ్ డిపో సిబ్బంది తరలింపును నిలిపి వేయాలని, బస్టాండ్‌కు స్థలం కేటాయించాలని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్‌ను పలుమార్లు కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. అందుకు రైల్వే జీఎం స్పందించి బస్టాండ్ స్థలం ఇవ్వడానికి రైల్వే సిద్ధంగా ఉందని, ప్రత్యామ్నాయంగా మరో చోట భూమి కేటాయించాలని కోరారన్నారు. త్వరలోనే కాజీపేట బస్టాండ్ పనులు జరుగనున్నట్లు ఆమె తెలిపారు.

## బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి

కాజీపేట, జూన్ 2 : ముస్లింలు బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణలో జరుపుకోవాలని కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి సూచించారు. కాజీపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం పీస్ కమిటీ ఆధ్వర్యంలో మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సైలు నవీన్‌కుమార్, లవన్ కుమార్, పీస్ కమిటి అధ్యక్షుడు సయ్యద్ సర్వర్, సభ్యులు మహమూద్, అఫ్జల్, యాకూబ్ పాల్గొన్నారు.

## కాజీపేటలో పోలీసుల కవాతు

కాజీపేట, మే 2 : కాజీపేట పట్టణంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ టీం, పోలీసులు సంయుక్తంగా సోమవారం కవాతు నిర్వహించారు. కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సాయుధ పోలీసులు ఫాతిమా నగర్ చౌరస్తా నుంచి దర్గా కాజీపేట వరకు ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు సుధాకర్‌రెడ్డి, పుల్యాల కిషన్, ప్రవీణ్‌కుమార్, వెంకన్న పాల్గొన్నారు.

## దరఖాస్తు చేసుకోవాలి

హనుమకొండ చౌరస్తా, జూన్ 2 : ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మొదటి దఫా అడ్మిషన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ ప్రభుత్వ ఐటీఐ బాలుర కాలేజీ ప్రిన్సిపాల్ చందర్ తెలిపారు. 10వ తరగతి మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక జరుగుతుందన్నారు. https://iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 21 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పది, ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఐటీఐ కోర్సుల్లో ప్రవేశం పొందడానికి 1-8-2024 నాటికి 14 సంవత్సరాలు నిండి ఉండాలని, ఆపై ఏ వయసు వారైనా దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు.

## రిటైర్డు పోలీసులకు సీపీ సన్మానం

సుబేదారి, జూన్ 2 : ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులను సీపీ సన్‌ప్రీత్ సింగ్ సన్మానించారు. హనుమకొండలోని సీపీ కార్యాలయంలో సోమవారం రిటైర్డు అయిన డీసీపీ జనార్దన్, ఎస్సైలు ఆలీ మహ్మద్, అఫ్జల్‌పాషా, రాజిరెడ్డి, పురుషోత్తం, మహేందర్‌రావు, కృష్ణాచారి, యాకూబ్ ఆలీ, ఏఎస్సై భీంరావు, హెడ్‌కానిస్టేబుల్ రమేశ్, కానిస్టేబుల్ కొండయ్యను సీపీ సన్మానించారు.

## బావిలో పడి వృద్ధురాలి మృతి

నడికూడ, జూన్ 2 : వృద్ధురాలు బావిలో పడి మృతి చెందిన ఘటన గొల్లపల్లిలో సోమవారం జరిగింది. జీల్ల లక్ష్మమ్మ (85) కుమారుల వద్ద ఉంటున్నది. వారి ఇంటికి దగ్గరలో వ్యవసాయ భూమి ఉంది. లక్ష్మమ్మ ఇంటి నుంచి దొడ్డి వైపు వెళ్తున్న క్రమంలో కంటి చూపు సరిగా లేక ప్రమాదవశాత్తు బావిలో పడింది. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులకు లక్ష్మమ్మ మృతదేహం బావిలో కనిపించింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, జూన్ 2 : హనుమకొండ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కేయూ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి 11గంటల వరకు సరస్వతీ నగర్, సమ్మయ్యనగర్, కుడా కాలనీ, శంకర్‌నగర్, ఆదర్శ నగర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**PLOT FOR SALE**



★Hnk గోపాలపూర్ భద్రకాళి కాలనీ రోడ్ నెంబర్ 2 లో ఈస్ట్ ఫేసింగ్ 300 స్క్వేర్ యార్డ్స్ 30 ఫీట్ల రోడ్డు మంచి వాస్తు క్లియర్ టైటిల్ గల ప్లాటు అమ్మబడును No Brokers cont : 8790501225 and 99499 12347.
NTW-337079

**CHANGE OF NAME**

★I, PILLALAMARRI SHIVA (New Name), previously called PILLALAMARI SHIVARAMIAH (Old Name), and R/o H.No. 35-2-1, Gopalpur, Hanamkonda, Hanumakonda District-506015, Telangana State, India, and solemnly declare.
NTW-7714

**WANTED**

★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.
NT-325336

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565